పల్లెల్లో అభివృద్ధి పరుగులు

- గత ఐదేళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం
- సచివాలయ వ్యవస్థతో తీరిన ప్రజల కష్టాలు



నాడు–నేడులో రూపుదిద్దుకున్న జెడ్పీ ఉన్నత పాఠశాల భవనం



తాళ్లరేవులో సచివాలయ భవనం

ముమ్మిడివరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమివ్వడంతో పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. గత ప్రభుత్వాల్లో ఎన్నడూ జరగని అభివృద్ధి గత ఐదేళ్లలో జరిగిందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతో గ్రామాల రూపురేఖలు మారుతున్నాయి. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించారు. ప్రతి గ్రామ సచివాలయంలో 11 మంది ఉద్యోగులను నియమించి పరిపాలనను పల్లె ప్రజలు చేరువ చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయడంతో గ్రామాలు మినీ సెక్రటేరియట్లుగా వ్యవహరిస్తున్నాయి.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

గతంలో జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో సహా ఏ పనికైనా సరే మండల కేంద్రాలకు పరుగులు పెట్టాల్సి వచ్చేది. అదీ నెలల తరబడి మండల కార్యాలయాల చుట్టూ తిరిగితే తప్ప పనులు అయ్యేవి కావు. దీనివల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడేవారు. గ్రామ సచివాలయ వ్యవస్థ వచ్చాక సొంత ఊరిలోనే ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలను అందుకుంటున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్యాన్ని ప్రజలు ముంగిటకు తీసుకొచ్చారు. ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నవరత్నాలు కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టింది. అలాగే ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉండేలా రూపకల్పన చేసి అందరి మన్నలు అందుకుంటుంది.

నియోజకవర్గ ముఖ కేంద్రమైన ముమ్మిడివరం నగర పంచాయతీలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరగని అభివృద్ధి, సంక్షేమం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలిచాక జరిగింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో ముమ్మిడివరం రూపురేఖలు మార్చేశారు. విద్య, వైద్యం, పాలనాపరమైన భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లతో పాటు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేశారు. అలాగే పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసి సొంతింటి కలను సాకారం చేశారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలకు రూ.2,300 కోట్లు ఖర్చు చేసినట్లుగా అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వాటిలో రోడ్లు, డ్రైయిన్లు, ఆర్‌బీకేలు, సచివాలయ భవనాలు, హెల్త్ సెంటర్ల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకే రూ.600 కోట్లు ఖర్చు చేశారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల నిర్మాణానికి రూ.2.71 కోట్లు, డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా నిమిత్తం రూ.160 కోట్లు, వడ్డీలేని రుణాలకు రూ.8.73 కోట్లు, వైఎస్సార్ పింఛన్ కానుక నిమిత్తం రూ.233.57 కోట్లు ఖర్చు చేశారు. నియోజకవర్గంలో 7,654 ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు.

అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



ముమ్మిడివరం నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిచ్చాం. సుమారు 2,300 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించాం. సీఎం జగన్మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించాను. మరింత అభివృద్ధి చేసేందుకు ప్రజలు మూడోసారి నాకు అవకాశం కల్పిస్తారని ధీమాతో ఉన్నాను.

– పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్యే, ముమ్మిడివరం

కుల, మత, రాజకీయాలకతీతంగా..



ముమ్మిడివరం నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందింది. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్నాం. స్నేహశీలి, సేవాతత్పరులైన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ప్రోత్సాహంతో మండలంలో అనేక సంక్షేమ అభివృద్ధి పథకాలు అందించాం.

– కోలా గంగా భవానీ, ఎంపీపీ, ముమ్మిడివరం

విద్యకు పెద్దపీట



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్దపీట వేసి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు ప్రవేశపెట్టారు. నాడు–నేడుతో గ్రామగ్రామాన ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేటు పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి.

– కుడిపూడి శివశంకరరావు, జెడ్పీటీసీ, ముమ్మిడివరం

క్లుప్తంగా

నేడు గోపవరంలో ఎన్నికల ప్రచారం

ఉప్పలగుప్తం: మండలంలోని గోపవరం, కూనవరం గ్రామాల్లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా సోమాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్యేక అలంకరణలో సోమాలమ్మ అమ్మవారు

ఉప్పలగుప్తం: మండలంలోని చినగాడవిల్లి గ్రామంలో వేంచేసియున్న సోమాలమ్మ అమ్మవారి విగ్రహ, శిఖర పునఃప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు బాదంపూడి సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి విఘ్నేశ్వర పూజ, మంత్ర స్థాపన, విగ్రహ స్థాపన, పూర్ణాహుతి జరిపారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల కోసం అన్న సమారాధన చేశారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిరామ్‌కు సత్కారం



సాయిరామ్‌ను సత్కరిస్తున్న పట్టణ గౌడ సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన న్యాయవాది వీరిన సాయిరామ్‌ను స్థానిక ముస్లిం వీధిలో బుధవారం ఘనంగా సత్కరించారు. పట్టణ గౌడ సంఘం అధ్యక్షుడు వెలిగట్ల జగదీష్‌బాబు అధ్యక్షతన జరిగిన అభినందన సభలో పలువురు సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ న్యాయవాదిగా సాయిరామ్ నిబద్ధతతో పనిచేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మట్టా రవికిషోర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వెలిగట్ల రామలక్ష్మణరావు, ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్, వీరిన రమేష్, వంక శ్రీను, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సత్య వరప్రసాద్ తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక 26వ వార్డులోని సూర్యబలిజ వీధిలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ బుధవారం ప్రారంభించారు. భాస్కర్ల పద్మావతి, యండయూరి సింహాచలం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుడు మాజీ కౌన్సిలర్ భాస్కర్ల రామకృష్ణ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో స్థానిక సుబ్బాలమ్మ దేవస్థానం మాజీ చైర్మన్లు కాశే వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి సాయి పుల్లయ్యనాయుడు, దేవస్థానం అభివృద్ధి కమిటీ ప్రతినిధి యర్రంశెట్టి మూర్తి, మొగలి శ్రీను, కొప్పుల బాబి, సరిదే రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత



విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న సత్యనారాయణ మాస్టారు

ముమ్మిడివరం: స్థానిక భవిత పాఠశాలలో 23 మంది దివ్యాంగ విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్‌లు, బిస్కెట్ ప్యాకెట్లు, తిను బండారాలు రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు పితాని సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ కె.శ్రీలక్ష్మి, సిబ్బంది, పిల్లల తల్లి తండ్రులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన బ్యాలెట్ ఓటింగ్

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఎన్నికల్లో భాగంగా ముందస్తుగా నిర్వహిస్తున్న బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ బుధవారం రెండో రోజు కొనసాగింది. 85 ఏళ్ల వృద్ధులు, దివ్యాంగ ఓట్లు మొత్తంగా 302 ఉన్నాయి. 85 ఏళ్లకు పైబడిన వృద్ధులకు సంబంధించి ఇప్పటివరకూ 65 బ్యాలెట్ ఓట్లు, దివ్యాంగులకు సంబంధించి 74 బ్యాలెట్ ఓట్లను స్వీకరించినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి తెలిపారు.

19న సెలవు ప్రకటిస్తూ గెజిట్ విడుదల

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న పోలింగ్ ప్రక్రియ నిర్వహించనున్న నేపథ్యంలో ఆ రోజున అన్ని ప్రభుత్వ సంస్థలు, స్థానిక సంస్థలు, వ్యాపార, పారిశ్రామిక సంస్థలకు సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వ కార్యదర్శి ఎంపీ హిరాన్ బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ప్రజలందరూ పోలింగ్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వేతనంతో కూడిన సెలవును ప్రకటించినట్లు తెలిపారు. ఈ మేరకు యానాం రీజినల్ అడ్మినిస్ట్రేటర్ కార్యాలయానికి సైతం ఆదేశాలు జారీ చేశారు.

నవోదయకు 28 మంది ఎంపిక

యానాం: 2024–25 విద్యాసంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయకు ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షలో రీజెన్సీ స్కూల్ నుంచి 28 మంది విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం టీవీఎస్ఎస్‌వీ ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను రీజెన్సీ సంస్థల చైర్మన్ డాక్టర్ జీఎస్ నాయుడు, ఎన్.సత్యేంద్రప్రసాద్ తదితరులు అభినందించారు.

8, 9 తేదీల్లో యానాంలో ప్రచారం

యానాం: బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ ఎన్డీయే కూటమి అభ్యర్థిగా పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న హోమ్‌మంత్రి నమశ్శివాయం ఈ నెల 8, 9 తేదీల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించడానికి యానాం విచ్చేయనున్నారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ముఖ్యమంత్రి రంగసామి సైతం ప్రచారంలో పాల్గొనే అవకాశం ఉందన్నారు. కావున ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలు, అభిమానులకు ఆయన పిలుపునిచ్చారు. ఈ నెల 1 నుంచే నమశ్శివాయం పుదుచ్చేరి నుంచి తన ప్రచారాన్ని ప్రారంభించారు. యానాం పర్యటన అనంతరం కారైకల్ తదితర ప్రాంతాల్లో ప్రచారాన్ని నిర్వహించనున్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవాలి



ఉప్పూడిలో పొన్నాడ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్

కాట్రేనికోన: ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పూడి, నాగి చెరువు, బంటుమిల్లి, మిలిందనగర్, లక్ష్మీవాడ, పెనుమల్లే గ్రామాల్లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లిన పొన్నాడకు మహిళలు మంగళ హారతులు ఇస్తూ బ్రహ్మరథం పట్టారు. ముందుగా ఉప్పూడిలో అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ మళ్లీ వలంటీర్లు ప్రతి నెలా 1వ తేదీనే మీ ఇంటి తలుపు తట్టి పింఛన్ సొమ్ము అందించాలంటే జగనన్న ముఖ్యమంత్రి కావాలన్నారు. అవ్వా తాతలు ఫ్యాను గుర్తుకు ఓటు వేసి జగనన్నకు మద్దతుగా నిలవాలని లేదంటే సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోవాల్సి వస్తుందన్నారు. చంద్రబాబు కోర్టులకు వెళ్లి వలంటీర్లు పింఛన్ పంపిణీ చేయకుండా అవ్వాతాతలపై రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. మహిళలు ఓటు అనే ఆయుధంతో సంక్షేమ రాజ్యాన్ని గెలిపించవలసిన బాధ్యత ఉందన్నారు. ఉప్పూడిలో సుమారు 20 మంది టీడీపీ కార్యకర్తలు పొన్నాడ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కాట్రేనికోనకు చెందిన తటపర్తి వెంకట రత్నం కాంగ్రెస్ పార్టీ నుంచి పొన్నాడ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, ఏడిది చక్రపాణిరావు, పాలెపు ధర్మారావు, నడింపల్లి సూరిబాబు, కాశి బాలమునికుమారి, సలాది తులసీరావు, రంగాల చిట్టిబాబు, ర్యాలి వీరబాబు, ఉచ్చుల రవి, బీర జాన్, నల్లా రాంబాబు, గెల్లా రాజేంద్ర, చొల్లంగి వెంకటేశ్వరరావు, బీర ధనుంజయ్, ఏడిది సుబ్బు, నాతి సత్య నారాయణ, సంసాని నాగేశ్వరరావు, తిరుకోటి శాంతి సుధ, నాతి అలివేణి, నల్లా బేబి జానకి, గుత్తుల సత్యనారాయణ, వంకా ఏడు కొండలు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలను తెరిపించేందుకు కృషి చేస్తా



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైథిలింగం, నారాయణసామి తదితరులు

యానాం: యానాంలో పరిశ్రమలు మూతపడటంతో నిరుద్యోగులు ఉపాధి లేక వలసలు వెళుతున్నారని, పరిశ్రమలను తెరిపించేలా కృషి చేస్తానని కాంగ్రెస్ ఇండియా కూటమి అభ్యర్థి వైథిలింగం హామీ ఇచ్చారు. పుదుచ్చేరి లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి కాంగ్రెస్ ఇండియా కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న వైథిలింగం బుధవారం నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల్లో ప్రచార ర్యాలీ నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి నారాయణసామి, మాజీ కేంద్ర రక్షణ మంత్రి ఎం.పళ్లంరాజు తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు ముందుగా స్థానిక భూసమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. బాలయోగి స్టేడియం ఎదురుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం స్టేట్ బ్యాంక్ రోడ్డు, పిల్లారాయవీధి, చిన్నాసెంటర్, అంబేడ్కర్ సర్కిల్, మెట్టకూరు, గోపాల్‌నగర్, కనకాలపేట, యూకేవీనగర్, సావిత్రినగర్ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జి మల్లాడి సత్తిబాబు, అర్దాని దినేష్, బంగారం, పుదుచ్చేరి ఎమ్మెల్యే వైద్యనాథన్, రుద్రరాజు, పెద్ద సత్య పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

'పది' మూల్యాంకన సిబ్బందికి వితరణ



ఉపాధ్యాయులకు శీతల పానీయాలు అందిస్తున్న ఎస్టీయూ జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకన విధులు నిర్వహిస్తున్న 1100 మంది సిబ్బందికి జిల్లా ఎస్టీయూ శాఖ బుధవారం శీతల పానీయాలను అందించింది. మండు వేసవిలో మూల్యాంకన విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులకు దాహార్తిని తీర్చేందుకు ఈ వితరణ కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శి సరిదే సత్య పల్లంరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివ ప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ బోణం నారాయణ, జిల్లా నాయకులు నల్లా రామకృష్ణ, ఎస్.రాజరాజేశ్వరి, నందెపు శ్రీనివాస్, యండమూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్ట్

యానాం: పట్టణ పరిధిలో గత నెల 17వ తేదీన జరిగిన కిడ్నాప్ ఘటనకు సంబంధించి ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ రాజశేఖరన్ బుధవారం తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం కాకినాడ వెంకటనగర్‌కు చెందిన అద్దేపల్లి వెంకట సత్యనారాయణ అనే వ్యక్తి యానాం పాతబస్టాండ్‌లో రాత్రివేళ బస్ ఎక్కేందుకు వేచి ఉండగా ఇద్దరు యువకులు బైక్‌పై వచ్చి అతడిని కిడ్నాప్ చేసి దరియాలతిప్ప పాత ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల వరకూ తీసుకువెళ్లారన్నారు. అనంతరం అతడి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు రూ.6,500 నగదు లాక్కోవడంతో పాటు బెదిరించి సెల్‌ఫోన్‌లో ఫోన్‌పే పిన్ నెంబరు అడిగి దాన్నుంచి రూ.51 వేలు తీసుకుని పరారయ్యారన్నారు. ఈ నేపథ్యంలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. బుధవారం మెట్టకూరు చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ నిర్వహిస్తుండగా బాధితుడు చెప్పిన బండి నెంబరు ఆధారంగా నిందితులను పట్టుకున్నారు. నిందితులు కాకినాడ జగన్నాథపురానికి చెందిన కాశవపు వీరవెంకట సత్యవిఘ్నేష్, చెరిపల్లి సతీష్‌లుగా గుర్తించారు. వారిద్దరినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని ఎస్పీ రాజశేఖరన్ తెలిపారు.

చంద్రబాబు వల్లే పింఛన్ దారులకు అవస్థలు



జున్నూరి రామారావు

అల్లవరం: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కారణంగానే పింఛన్ దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏపీ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జున్నూరి రామారావు అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు, ఆయన అనుచరుడు నిమ్మగడ్డ ప్రసాద్ తప్పుడు సమాచారం ఇచ్చి ఎన్నికల కమిషన్ ద్వారా పింఛన్ల పంపిణీ నుంచి వలంటీర్లను తొలగించారన్నారు. దీంతో ఇంటికి పింఛన్ రాక లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. నడవలేని వృద్ధులు, దివ్యాంగుల అవస్థలు చెప్పలేనివని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణా జిల్లా గంగూరు సచివాలయం వద్దకు పెన్షన్ తీసుకోవడానికి వెళ్లిన వజ్రమ్మ అనే వృద్ధురాలు ఎండకు తాళలేక వడ్డదెబ్బకు గురై బుధవారం మృతి చెందిందన్నారు. పేరూరులో ఓ వృద్ధుడు స్పృహ తప్పి పడిపోతే స్థానికులు హుటాహుటిన స్పందించడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం వ్యవస్థకు అనుసంధానంగా వలంటీర్లను ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను లబ్ధిదారుల చెంతకే చేరవేశారన్నారు. 58 నెలలుగా వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, 13 విభాగాల పెన్షన్ దారులకు తెల్లవారుజామునే వలంటీర్ల ద్వారా పెన్షన్ అందిస్తున్నారన్నారు. ఎన్నికల కమిషన్ నిర్ణయంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు విస్తృత ఏర్పాట్లు



ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏఓ ప్రశాంతి

తాళ్లరేవు: రబీ పంట ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖాధికారి ఎన్.ప్రశాంతి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో ధాన్యం కొనుగోలుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేయాలనే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పక్కాగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దిగుబడికి అనుగుణంగా గోనె సంచులు, రవాణాకు అవసరమైన ట్రాక్టర్లు, లారీలను సిద్ధం చేస్తున్నామన్నారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖాధికారి ఎన్.ప్రశాంతి మాట్లాడుతూ వారం పది రోజుల్లో కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మండల పరిధిలోని 21 ఆర్బీకే కేంద్రాలకు సంబంధించి 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సాధారణ రకం ధాన్యం 75 కేజీలకు రూ.1,637, గ్రేడ్ –ఎ రకం ధాన్యం 75 కేజీలకు రూ.1,652 ధరకు కొనుగోలు చేస్తామన్నారు.

వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన శాస్త్రవేత్తల బృందం



గోపవరంలో వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తల బృందం

ఉప్పలగుప్తం: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా ఏరువాక కేంద్రం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నందకిషోర్ బృందం గోపవరంలోని అభ్యుదయ రైతు అయితాబత్తుల ఉమామహేశ్వరరావుకు చెందిన ఎంటీయూ 1293 వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త నందకిషోర్ వరి రకాలు, చీడపీడల నివారణ, సస్య రక్షణపై రైతులకు సూచనలిచ్చారు. మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో కొత్తగా రూపొందించిన ఎంటీయూ 1293 వరి సన్న రకం అని దిగుబడి ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు వస్తుందన్నారు. దీని పంట కాలం 120 నుంచి 125 రోజులని తెలిపారు. సుడిదోమ నివారణకు మెట్రోఫైజ్ 0.6 గ్రాములు లేదా ట్రై ఫ్లూమిజో పైరిం 0.48 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతులు ఎ.దొరబాబు, ఎన్.రామారావు, ఎ.ఉప్పరయ్య, ఎస్.సతీష్, ఎస్.సత్తిబాబు, జి.బాలరాజు, ఆర్.వెంకటేశ్వరరావు, ఎస్.ఏసు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

అమలాపురం రూరల్: ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా వడగాల్పులకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేరూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆడమ్స్ రాహుల్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలతో బుధవారం జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ వడగాల్పుల వల్ల తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం వస్తుందన్నారు. ప్రజలంతా వాతావరణ సమాచారం తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎండలో బయట తిరగొద్దని, తప్పనిసరై వెళ్లాల్సి వస్తే టోపి పెట్టుకోవాలని సూచించారు. కళ్లకు రక్షణగా సన్ గ్లాసెస్ ధరించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు బయట తిరగొద్దని చెప్పారు. ఎండలో నుంచి వచ్చిన వెంటనే నీరు, నిమ్మరసం, కొబ్బరి నీరు తాగాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ రాజ్యలక్ష్మి, హెచ్‌వీ శాంతకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ కామేశ్వరరావు, కేవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంచు కురిసే వేళలో..



పెదపళ్లలో మంచుతో కప్పేసిన వరిచేను



మండపేట-ఆలమూరు రోడ్డులో మంచు ప్రభావానికి ఫ్లడ్‌లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్న కారు



గుమ్మిలేరులో సూర్యుడిని కప్పేసిన మంచు తెరలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రధాన రహదారులు, లంక పరీవాహక ప్రాంతాలన్నీ బుధవారం ఉదయం మంచుతో తడిసి ముద్దయ్యాయి. పగలు మండు టెండలు, రాత్రి వేళల్లో ఉక్కపోత ఉంటుండగా తెల్లవారుజాము నుంచి మాత్రం మంచు తీవ్రంగా కురుస్తూ జన జీవనానికి తీవ్ర ఆటంకాన్ని కలిగించే విచిత్ర పరిస్థితి నెలకొంది. దట్టమైన మంచుతో సంతరించుకున్న కొత్త అందాలతో వివిధ ప్రదేశాలు కనువిందు చేశాయి. తెల్లవారుజాము నుంచి ఏకధాటిగా కురుస్తున్న మంచు వల్ల ఉదయం ఎనిమిది గంటల వరకూ మంచు పొరలు వీడలేదు. ఒక దశలో మంచు విపరీతంగా కురియడంతో ఒకరి కొకరు కనబడనంతగా కమ్మేసింది. రోజు మాదిరిగా దైనందిన కార్యక్రమాలకు వెళ్లవలసిన వారంతా వేచి చూడక తప్పని పరిస్థితి ఏర్పడింది. వేసవిలో సైతం సూర్యుడు కనిపించనంతంగా ఈ మంచు దట్టంగా కురవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. మండలంలోని లంక గ్రామాల్లో ఈ మంచు కురుస్తున్న దృశ్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అయితే ఆలమూరు–మండపేట రోడ్డులో మంచు దుప్పటి తీవ్రంగా కమ్ముకోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వేగంగా దూసుకెళ్లే వాహనాలన్నీ లైట్లు వేసుకుంటూ 20–30 కి.మీ వేగానికే పరిమితమవడం విశేషం.